సాక్షి నంద్యాల

బుధవారం । 5 । జూలై । 2023



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రంలోని శనగల బసవన్న, బయలువీరభద్ర స్వామికి మంగళ వారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించారు.



కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల డ్యాం నుంచి మంగళవారం కర్నూలు నగర ప్రజల తాగు నీటి అవసరాలకు 189 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. డ్యాంలో 0.990 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



రైతు చూపు.. మిర్చి వైపు

గతేడాది మిర్చి ధరలు ఆశాజనకంగా ఉండటంతో జిల్లా రైతులు ఈ ఏడాది మిర్చి సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే పలువురు రైతులు నారుపోసి సాగుకు సిద్ధమయ్యారు. 8లో..

న్యూస్‌రీల్

అల్లూరి సీతారామరాజుకు నివాళి



అల్లూరి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కోన శశిధర్, కలెక్టర్ మనజీర్, ఎస్పీ రఘువీర్

నంద్యాల(వ్యవసాయం): విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 126వ జయంతిని పురస్కరించుకొని కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆయన చిత్రపటానికి జేకేసీ స్పెషల్ ఆఫీసర్ కోన శశిధర్, కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఎస్పీ రఘువీర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 27 ఏళ్ల వయస్సులోనే స్వాతంత్య్ర యోధులైన తిరుగుబాటుదారులను సమీకరించి ఆంగ్లేయులను గడగడలాడించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు.

వివేకానందుని బాటలో నడవాలి



వివేకానందుడి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

నంద్యాల(వ్యవసాయం): నేటి యువత స్వామి వివేకానందుడి బాటలో నడవాలని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా పేర్కొన్నారు. సోమవారం స్థానిక కల్పనా సెంటర్‌లో రూ. 4 లక్షలతో ఏర్పాటు చేసిన స్వామి వివేకానంద కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాతల సహకారంతో యువతకు స్ఫూర్తిగా నిలిచేలా పట్టణంలో పలు చోట్ల దేశభక్తి నాయకుల విగ్రహాలు ఏర్పాటు చేస్తామన్నారు. హైకోర్టు రిటైర్డు జడ్జి శివప్రసాద్, డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ భారత జాతిని జాగృత పరిచిన మహనీయుడు వివేకానందుడని, ఆయన రచనలు, దేశ భక్తి భావాలు ప్రపంచానికి చాటాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి, కౌన్సిలర్లు ఆరీఫ్‌నాయక్, నజీద్, సాదిక్, కో ఆప్షన్ మెంబర్ సలాముల్లా తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి రూ.80 లక్షలు

మహానంది: తమ్మడపల్లె గ్రామంలో మహానందీశ్వర దేవస్థానం దత్తత దేవాలయమైన శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం కోసం రూ.80 లక్షలు మంజూరైనట్లు మహానంది ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి సహకారంతో దేవదాయశాఖ సీజీఎఫ్ నిధుల నుంచి రూ. 80 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఇందులో రూ. 20 లక్షలు గ్రామస్తుల భాగస్వామ్యం ఉందన్నారు.

బేతంచెర్లలో బ్రహ్మారెడ్డి ప్రజా వైద్యశాల సీజ్



ఆసుపత్రిని సీజ్ చేస్తున్న అధికారులు

బేతంచెర్ల: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక శేషారెడ్డి నగర్‌లోని డాక్టర్ బ్రహ్మారెడ్డి ప్రజా వైద్యశాలను మంగళవారం అధికారులు సీజ్ చేశారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, జిల్లా మాస్ మీడియా అధి కారి రవీంద్ర నాయక్, ఆర్ఐ శ్రీదేవి, వీఆర్వో గోవిందప్ప పోలీసులతో కలసి వైద్యశాలను సీజ్ చేశారు. గతంలో ఈ ఆసుపత్రిలో గర్భ నిర్ధారణ పరీక్షలు చేయడంతో పాటు గర్భిణి మృతికి కారణమని ప్రజా సంఘాల నాయకుల ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు విచారణ చేసి సీజ్ చేసినట్లు సమాచారం.

నేడు ఎస్జీటీలకు పదోన్నతుల కౌన్సెలింగ్

కర్నూలు కల్చరల్: ఉమ్మడి కర్నూలు జిల్లాలో పని చేస్తున్న అన్ని యాజమాన్యాల సెకండరీ గ్రేడ్ టీచర్ల పదోన్నతుల కౌన్సెలింగ్ బుధవారం ఉదయం జరుగనుంది. నగరంలోని బిషప్ చర్చ్ సమీపంలోని సెయింట్ జోసఫ్ స్కూల్‌లో ఈ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డీఈఓ వి.రంగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఎస్జీటీ (తెలుగు, ఉర్దూ, కన్నడ), పీఈటీలు, లాంగ్వేజ్ పండిట్లు, తత్సమాన హోదా గల ఉపాధ్యాయుల పాఠశాల సహాయకుల పదోన్నతులకు సంబంధించిన సీనియారిటీ జాబితా డీఈఓ వెబ్‌సైట్ www.deokrnl13.blogspot.comలో ఉంచినట్లు వెల్లడించారు.

జిల్లా కేంద్రం నంద్యాలలో ప్రగతి పరుగులు పెడుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేయడంతో పట్టణానికి మహర్దశ పట్టింది. నాలుగేళ్లలో పట్టణం నలువైపులా అభివృద్ధి చెందింది. కోట్లాది రూపాయలతో ఏళ్ల నాటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో పాటు పాలక వర్గం, అధికారుల ప్రణాళికతో పట్టణం సరికొత్త రూపును సంతరించుకుంటోంది.

అభివృద్ధి.. అద్భుతం



ఆటో నగర్‌లో నందనవనంగా పార్క్

- నందుల కోటలో ప్రగతి పరుగులు
- రూ.234.67 కోట్లతో పట్టణాభివృద్ధి
- సౌకర్యవంతంగా రహదారులు, డ్రైనేజీల నిర్మాణం
- శరవేగంగా అమృత్ ఫేజ్–2 పనులు
- ఎనిమిది అర్బన్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటుతో మెరుగైన వైద్యసేవలు
- పార్కులతో ఆహ్లాదకర వాతావరణం



పంప్ హౌస్, ఫిల్టర్ బెడ్లు



బొమ్మల సత్రంలో వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్

నంద్యాల(సిటీ): నవ నందుల కోట వాకిట అభివృద్ధి వికసిస్తోంది. గతంలో అధ్వానంగా ఉన్న రహదారులు బాగుపడ్డాయి. శిథిలావస్థలో ఉన్న వంతెనల స్థానంలో కొత్తవి నిర్మితమయ్యాయి. ఉద్యానవనాల్లో పచ్చదనం పరుచుకుంది. డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపడింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నాలుగేళ్లలో నంద్యాల పట్టణంలో సుమారుగా రూ.234.67 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన నంద్యాల జిల్లా ఏర్పాటు హామీ నెరవేర్చడమే కాకుండా నంద్యాల పట్టణాభివృద్ధికి మరింత తోడ్పాటునందిస్తున్నారు. పట్టణంలో 122 అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.28.29 కోట్లు వెచ్చించి ప్రతి వీధికి రహదారులను కనెక్ట్ చేశారు. రూ.2.20 కోట్లతో రెండు నూతన బ్రిడ్జిల నిర్మాణంతో పలు ప్రాంతాలకు అనుసంధానం చేశారు. అదేవిధంగా గడపగడప కార్యక్రమంలో గుర్తించిన 19 పనులకు గాను సుమారుగా రూ.1.60 కోట్లు వెచ్చించి నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తున్నారు. పట్టణానికి అందుబాటులో నీళ్లు ఉన్నా కొన్ని దశాబ్దాలుగా పట్టణ ప్రజలను నీటి కష్టాలు వెంటాడాయి. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే నీటి సమస్యకు ఎమ్మెల్యే శిల్పా రవి శాశ్వత పరిష్కారం చూపించారు. ఇందుకు అమృత్ ఫేజ్–2లో రూ.158.50 కోట్లతో జరుగుతున్న పనులకు అనుసంధానంగా కేసీ కెనాల్ నుంచి నీటిని పంపింగ్ చేసేందుకు రూ.65 లక్షలతో డెడికేటెడ్ ఫీడర్ లైన్‌ను ఏర్పాటు చేశారు. అదేవిధంగా పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని నీటి నిల్వ సామర్థ్యాన్ని 28 ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్స్ పర్ డే) నుంచి 33 ఎంఎల్‌డీ నిల్వ కోసం రూ.40 లక్షలతో పంప్‌హౌస్‌లను ఏర్పాటు చేశారు. తద్వారా నీటి కోసం రాత్రులు జాగరణ చేయాల్సిన అవసరం లేకుండా ప్రతి రోజూ పగటి పూటే నీళ్లు వదిలేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

గడపగడపలో సమస్య పరిష్కారం..

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రజలు విన్నవించే సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేసింది. ఈ కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యే శిల్పా సత్వరమే సమస్యల పరిష్కారాన్ని చూపుతున్నారు. పట్టణంలోని 42 వార్డులకు గాను రూ. 20 లక్షల చొప్పున సుమారుగా 8.40 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపట్టారు. ఇప్పటి వరకు గుర్తించిన 19 పనులకు గాను సుమారుగా రూ.1.60 కోట్లతో పనులు చేశారు. మరిన్ని పనులను చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

రూ.5.65 కోట్లతో అర్బన్ హెల్త్ సెంటర్లు..

ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పట్టణంలోని పలు వార్డులలో వైఎస్సార్ అర్బన్ క్లినిక్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ నాలుగేళ్లలో 8 అర్బన్ హెల్త్ సెంటర్లకు రూ.5.65 కోట్లు వెచ్చించి ఐదు నూతన భవనాల నిర్మాణాలు, మరో 3 కేంద్రాలకు మరమ్మతులు చేపట్టారు. వారంలో మూడు రోజుల పాటు స్పెలిస్టు (గైనిక్, ఆర్థోపెడిక్, పిడియాట్రిషియన్) డాక్టర్లు అందుబాటులో ఉంటున్నందున అర్బన్ హెల్త్ క్లినిక్‌ల ఆదరణ మరింత పెరిగింది. ఈ కేంద్రాల్లో బీపీ, షుగర్, ఎల్ఎఫ్‌టీ, ఆర్ఎఫ్‌టీలతో పాటు సుమారుగా 63 రకాల వైద్య పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. పరీక్షల తర్వాత రోగికి అవసరమయ్యే 172 రకాలు మందులతో పాటు పలు సిరప్‌లు కూడా అందుబాటులో ఉంచారు.

సుందరంగా పార్కులు..

పట్టణంలోని ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు మున్సిపల్ అధికారులు పార్కులను ఏర్పాటు చేశారు. 42 వార్డులకు గాను 9 పార్కులను నిర్మించారు. రూ.3.04 కోట్లు వెచ్చించి పార్కులను తీర్చిదిద్దడంత పాటు వ్యాయామ పరికరాలు, ప్రత్యేక వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేశారు. చిన్నారులు ఆడుకోవడానికి గ్రీనరీ గార్డెన్‌లను ఏర్పాటు చేశారు.

నాలుగేళ్లలో పట్టణంలో జరిగిన అభివృద్ధి పనుల వివరాలు	
అభివృద్ధి పనులు	వ్యయం (రూ.కోట్లలో)
జనరల్ ఫండ్స్ కింద	52.12
డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం	5.65
అమృత్ ఫేజ్–2	158.50
15 ఆర్థిక సంఘం నిధులు	9.53
ఎంపీ ల్యాడ్స్ కింద	16.20
ఎస్సీఎస్టీ సబ్ ప్లాన్ నిధులు	7.11
గడప గడపకు మన ప్రభుత్వం	1.60
మొత్తం	234.67

పట్టణాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక



పట్టణాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నాం. ఎన్నికల ముందు పట్టణాభివృద్ధికి కృషి చేస్తామని చెప్పాం.. చెప్పిందే చేసి చూపిస్తున్నాం. ఇప్పటికే పలు సమస్యలకు శాశ్వత పరిష్కారం తీసుకువచ్చాం. మరింత నాణ్యమైన పాలనను ప్రజలకు అందించేందుకు కృషి చేస్తాం. గత ప్రభుత్వాల మాదిరిగా కాకుండా ప్రజలకు సేవలు అందిస్తున్నాం.

– శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి, ఎమ్మెల్యే, నంద్యాల

నాలుగేళ్లలో ఎంతో మార్పు



ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించడంతోపాటు పట్టణంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టాం. ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి చొరవతో పట్టణంలో పలు కాలనీలో సీసీ రోడ్లు నిర్మించాం. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో సమస్యలను గుర్తించి పరిష్కరించాం. సలీం నగర్, హనీఫ్ నగర్ మధ్య, పద్మావతి నగర్, దేవనగర్ మధ్య నూతన వంతెనలు నిర్మించి రాకపోకలకు మార్గం సుగమం చేశాం. నాలుగేళ్లలో పట్టణంలో ఎంతో మార్పు వచ్చింది.

– షేక్ మాబున్నిసా, మున్సిపల్ చైర్ పర్సన్, నంద్యాల

చెంచుల గృహ నిర్మాణానికి కృషి

- ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి



మృతుని కుటుంబానికి నగదు అందిస్తున్న ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి

పాములపాడు: చెంచు గిరిజనులకు పక్కా గృహాలు నిర్మించేందుకు కృషి చేస్తామని ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. వేంపెట చెంచు గూడెంలో 22 కుటుంబాల్లో 66 మంది జనాభా ఉన్నారు. గూడెంలో ఇటీవల ఇద్దరు అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆయన మంగళవారం చెంచు గూడెంను సందర్శించారు. వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. జగనన్న పక్కా గృహాలు మంజూరైనా ఎందుకు నిర్మించుకోలేదని ప్రశ్నించగా.. ఆర్థిక ఇబ్బందులతో సాధ్యం కాలేదని, అధికారులే నిర్మించాలని గిరిజనులు కోరారు. ఆయన వెంట ఉన్న ఆర్డీటీ రీజనల్ మేనేజర్ పుష్పను వారి సంస్థ ద్వారా నిర్మించాలని చెప్పగా, బేస్‌మెంటు లెవెల్ వరకు నిర్మించుకుంటే మిగతా ఇంటి నిర్మాణం చేపడతామని ఆమె తెలిపారు. అలాగే వ్యవసాయ భూము ల్లో బోరు బావులు వవ్విస్తామని చెప్పారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన నాగవల్లి, వీరన్న కుటుంబాలకు రూ.5,000 చొప్పున నగదు అందజేశారు. గూడెంలో డాక్టర్ నాగలక్ష్మి దేవి, టీబీ వైద్యాధికారి పవన్‌కుమార్‌లు వైద్యశిబిరం నిర్వహించి క్షయ వ్యాధి నిర్ధారణపరీక్షలు నిర్వహించారు. అనంతరం వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పఠాన్‌బాబు, ప్రత్యేకాధికారి కేజీ నాయక్, ఏపీఓ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

రానున్న రోజుల్లో భారీ వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్)/ఎమ్మిగనూరు రూరల్: కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు చిరు జల్లులతో పాటు ఓ మోస్తరు వర్షపాత సూచన ఉన్నట్లు బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం వాతావరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ మహదేవయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్ ఆరంభం నుంచి వర్షాలు తేలికపాటి నుంచి ఒక మోస్తరుకే పరిమితం అయ్యాయి. ఇప్పటి వరకు ఖరీఫ్ పంటల సాగులో పురోగతి అంతంతమాత్రంగానే ఉంది. మామూలుగా అయితే ఈ సమయానికి 50 శాతం వరకు సాగు పూర్తి కావాల్సి ఉంది. వర్షాలు లేకపోవడంతో సాగు 15 శాతం వరకు లేకపోవడం ఆందోళన కలిగించే విషయం. ఎట్టకేలకు రుతుపవనాలు చురుగ్గా ఉండటం వల్ల వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సోమవారం రాత్రి కోసిగి, సీ.బెళగల్, గూడూరు, వెల్దుర్తిలలో తేలికపాటి వర్షం కురిసింది.

పరిశ్రమల స్థాపనతోనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

- స్థానికుల సహకారంతోనే పరిశ్రమలు వృద్ధి
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, చిత్రంలో జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: పరిశ్రమల స్థాపనతోనే స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. పెట్నికోట సమీపంలో అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ కొత్త ప్లాంట్‌ను ఏర్పాటు చేయబోతోంది. ఈ క్రమంలో గొర్విమానుపల్లె సమీపంలో 395.15 హెక్టార్లలో మైనింగ్ అనుమతికి మంగళవారం గ్రామ సమీపంలో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో డీఆర్ఓ పుల్లయ్య, పర్యావరణ శాఖ ఈఈ మునిప్రసాద్ అధ్యక్షతన ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దనరెడ్డి తదితరులు పాల్గొన్నారు. గొర్విమానుపల్లె, పెట్నికోట గ్రామాలకు చెందిన పలువురు రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ విలువైన భూములిచ్చిన రైతులు తమ పిల్లలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరడం న్యాయమైందన్నారు. కొలిమిగుండ్ల మండలంలో సిమెంట్ ఫ్యాక్టరీలకు అవసరమైన వనరులతో పాటు ప్రజలు, శాంతి భద్రతలు బాగా ఉండటంతో పరిశ్రమల స్థాపనకు ముందుకొస్తున్నారని చెప్పారు. స్థానికుల సహకారంతోనే పరిశ్రమలు వృద్ధి చెందుతాయన్నారు. పెట్నికోట వద్ద సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ముందుకు రావడం శుభ పరిణామమన్నారు. యూనియన్ల పేరుతో ఆందోళనలు చేస్తుండటంతో కంపెనీల యాజమాన్యాలు భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. ఇక్కడ యూనియన్ల ఏర్పాటును ఎట్టి పరిస్థితుల్లో సహకరించమన్నారు. స్థానికులకు 75 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. గొర్విమానుపల్లె వద్ద బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయాలని యాజమాన్యాన్ని కోరారు. అంకిరెడ్డిపల్లె సమీపంలో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న పీహెచ్‌సీకి అన్ని రకాల సామగ్రి ఇచ్చేందుకు అల్ట్రాటెక్ కంపెనీ ముందుకు రావడం శుభపరిణామన్నారు.

గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలి

సీఎస్ఆర్ నిధులతో గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని అల్ట్రాటెక్ సిమెంట్ యాజమాన్యాన్ని జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పేర్కొన్నారు. గతంలో ఫ్యాక్షన్, రైల్వే లైన్ లేక పరిశ్రమలు రాలేదని గుర్తు చేశారు. పర్యావరణానికి హాని లేకుండా ఆధునాతన పద్ధతులు అవలభించాలని సూచించారు. మైనింగ్ చేపట్టే సమయంలో వాగులు, కుంటలకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పశువులు, జీవాల మేత కోసం కొంత భూమి కేటాయించాలన్నారు. కంపెనీ ఏర్పాటు కోసం సహాయ సహకారాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రామాంజనేయులు, ఎంపీటీసీ సభ్యుడు పులి ప్రకాష్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు కేపీ రామ్మోహన్‌రెడ్డి, జగన్, తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్ తదితరులు పాల్గొన్నారు.

తమ్ముళ్ల అత్యుత్సాహం

పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సభలో తెలుగు తమ్ముళ్లు అత్యుత్సాహం ప్రదర్శించారు. గొర్విమానుపల్లె, పెట్నికోట గ్రామాల నుంచి కాక ఇతర గ్రామాల నుంచి వాహనాల్లో టీడీపీ కార్యకర్తలను సమావేశానికి తీసుకొచ్చారు. టీడీపీ నాయకులు మాట్లాడే సమయంలో తమ్ముళ్లు ఈలలు, కేకలు వేస్తూ హంగామా చేశారు. కొంత మంది సభలో అసలు సమస్య చెప్పకుండా వ్యక్తిగత సమస్యలు తీసుకొచ్చి రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడంతో పోలీసులు గట్టిగా మందలించారు. ఆళ్లగడ్డ, డోన్ డీఎస్పీలు వెంకట్రామయ్య, శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో 350 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

జగనన్న సురక్షతో అర్హులందరికీ న్యాయం

- ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్



నంద్యాల మండలం కానాల గ్రామంలో అర్జీదారుడికి ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్, కలెక్టర్ మనజీర్ జిలానీ, ఎమ్మెల్యే శిల్పా రవి తదితరులు

నంద్యాల(రూరల్): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ (ఐటీ) కోన శశిధర్ అన్నారు. మంగళవారం నంద్యాల మండలం కానాల గ్రామంలో జగనన్న సురక్ష క్యాంపును ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిశోర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోన శశిధర్, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ హాజరై అర్హులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కోన శశిధర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు మెరుగైన సేవలు అందించేందుకు సచివాలయ, వలంటీర్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారన్నారు. అర్హత కలిగి సంక్షేమ పథకాలు పొందలేని వారిని గుర్తించి అవసరమైన 11 రకాల ధ్రువీకరణ పత్రాలను కేవలం ఒక్కరోజులో అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ముందస్తుగా వలంటీర్ ప్రతి ఇంటికెళ్లి వారికి ఏవైతే సర్టిఫికెట్లు అవసరమవుతాయో తెలుసుకొని దరఖాస్తును పూర్తి చేయించి వారికి టోకెన్లను అందజేసి, సర్టిఫికెట్లను అందించే కార్యక్రమాలను చేస్తున్నారన్నారు. నంద్యాల జిల్లాలో ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ ఈ కార్యక్రమాన్ని ఎంతో బాధ్యతాయుతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, డ్వామా పీడీ రామచంద్రరెడ్డి, ఆర్‌డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ శ్రీనివాసులు, డిప్యూటీ సీఓ సుబ్బారెడ్డి, గ్రామ సర్పంచ్ దూదేకుల బావమ్మ, ఎంపీపీ శెట్టి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పైసా ఖర్చు లేకుండా ధ్రువీకరణ పత్రాలు



గతంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం మండల కార్యాలయాల చుట్టూ రోజూ తిరగాల్సి వచ్చేది. సాయంత్రం రండి.. రేపు రండి అంటూ తిప్పుకునేవారు. ఒక్కోసారి అధికారులు ఎక్కడికో వెళ్లారు అని సమాధానం వచ్చేది. వలంటీర్ వ్యవస్థతో ప్రతి పని ఎంతో సులువైంది. అధికారుల చుట్టూ తిరిగే పని లేకుండా పోయింది. జగనన్న సురక్ష పథకంలో భాగంగా కుల,ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు చేసిన రోజే పైసా ఖర్చు లేకుండా అధికారులు అందజేశారు.

– షేక్ హుశ్యం, కానాల గ్రామం, నంద్యాల మండలం

నియోజకవర్గాల వారీగా అందించిన సేవల వివరాలు..			
నియోజకవర్గం	టోకెన్ల సంఖ్య	పరిష్కారానికి పంపినవి	అందజేసిన సేవలు
నంద్యాల	1,599	1,476	1,001
ఆళ్లగడ్డ	1,572	1,332	1,267
బనగానపల్లె	1,879	1,641	1,543
డోన్	3,059	2,759	2,465
నందికొట్కూరు	4,076	3,864	3,488
పాణ్యం	562	536	502
శ్రీశైలం	2,282	2,068	1,778
మొత్తం	15,029	13,679	12,044

ధ్రువీకరించి.. పత్రాలు ఇచ్చి

- నాలుగో రోజు 12,044 సర్టిఫికెట్ల పంపిణీ
- పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

నంద్యాల: జగనన్న సురక్ష కార్యక్రమంలో 11 రకాల ధ్రువపత్రాలు తక్షణమే ప్రజలకు అందుతున్నాయి. మొదటి రోజు జూలై 1న జిల్లాలో నిర్వహించిన కార్యక్రమంలో 16,207 మందికి 11 రకాల ధ్రువపత్రాల కోసం టోకెన్లు అందజేయగా వాటిలో 14,170 టోకెన్లను అధికారులు పరిశీలించి 12,390 మందికి ధ్రువపత్రాలు అందజేశారు. రెండో రోజు మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 15,029 మందికి టోకెన్లు అందజేయగా వాటిలో 13,679 టోకెన్లు పరిశీలించి 12,044 మందికి ధ్రువపత్రాలు అందజేశారు. నంద్యాల నియోజకవర్గంలో కానాల గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో జేకేసీ స్పెషల్ ఆఫీసర్ కోన శశిధర్, కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరై ప్రజలకు ధ్రువపత్రాలు అందజేశారు. ఆళ్లగడ్డ నియోజకర్గంలోని గుండంపాడులో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, ఆత్మకూరు నియోజకవర్గంలోని కరివేన, ఆత్మకూరు పట్టణంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి, అధికారులు పాల్గొని ప్రజలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారి ఇంటి వద్దకే వెళ్లి వారికి కావాల్సిన సర్టిఫికెట్లకు సంబంధించి వివరాలు తీసుకొని వారి సచివాలయ పరిధిలోనే సమస్యను పరిష్కరించి ధ్రువపత్రాలు అధికారులు అందజేస్తుండటం సంతోషంగా ఉందన్నారు.

క్లుప్తంగా

భార్యాభర్తల ఘర్షణ

• తోపులాటలో కింద పడి మృతి చెందిన భర్త

గడివేముల: కొర్రపోలూరు గ్రామంలో భార్యాభర్తల మధ్య ఘర్షణ భర్త మృతికి కారణమైంది. ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చాకలి లోకేశ్వరుడు (37) మద్యానికి బానిసై నిత్యం భార్యతో ఘర్షణ పడుతుండేవాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి భర్త మద్యం సేవించి ఇంటికి చేరుకుని డబ్బు కోసం భార్య సుబ్బలక్ష్మమ్మతో ఘర్షణ పడ్డాడు. ఆ క్రమంలో ఆమె భర్తను తోయడంతో కడపమాను పక్కన ఉన్న రాయిపై పడ్డాడు. దీంతో తలకు రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పాణ్యం సీఐ వెంకటేశ్వరావు, ఎస్ఐ హుటాహుటిన గ్రామానికి చేరు కుని విచారణ చేశారు. ఈ మేరకు మృతుని తండ్రి వంగాల చాకలి వెంకటరాముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నంద్యాల ఆసుపత్రికి తరలించా రు. వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న మృతునికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఈనెల 25 నాటికి హాస్టళ్లలో అడ్మిషన్లు పూర్తి

కర్నూలు(అర్బన్): జిల్లాలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో ఈ నెల 5వ తేదీ నాటికి రెన్యూవల్స్, 25వ తేదీ నాటికి ఫ్రెష్ అడ్మిషన్లు పూర్తి చేయాలని ఆ శాఖ జాయింట్ డైరెక్టర్ జె.రంగలక్ష్మీదేవి ఆదేశించారు. మంగళవారం స్థానిక సంక్షేమభవన్‌లోని తన ఛాంబర్‌లో సహాయ సంక్షేమాధికారులు, వసతి గృహ సంక్షేమాధికారులతో ఆమె సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ అన్ని వసతి గృహాల్లో మెనూ పక్కాగా అమలు చేయాలన్నారు. ప్రభుత్వంమెస్ చార్జీలను పెంచిన నేపథ్యంలో ఉదయం టిఫిన్, స్నాక్స్, డిన్నర్‌ను నిర్ణీత సమయంలోగా విద్యార్థులకు వడ్డించి ప్రతి రోజు రాత్రి 7.30 గంటల కంతా ఫొటోలను అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రతి సోమవా రం మధ్యాహ్నం 3 గంటలకు జిల్లాలోని అందరూ సహాయ సంక్షేమాధికారులు, వసతి గృహ సంక్షేమాధికారులతో డైరెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తారన్నారు.

రైతు చూపు.. మిర్చి వైపు

- గతేడాది కలిసొచ్చిన పంట
- ఎకరాకు 25–28 క్వింటాళ్ల దిగుబడి
- క్వింటా రూ. 24 వేలకు పైగా ధర పలికిన వైనం
- ఈ ఏడాది జిల్లాలో 20 వేల హెక్టార్లలో సాగుకు అవకాశం
- ఎకరా రూ.90 వేలు పలుకుతున్న కౌలు ధర



పేరుసోముల సమీపంలో మిరప నారుమడి

కోవెలకుంట్ల: గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో మిరప సాగు చేసిన రైతులకు అన్ని విధాలా కలిసోచ్చింది. మొదట్లో వర్షాభావం, సాగునీటి కష్టాలు, తెగుళ్లు, పైరు పూత, పిందె దశలో తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు.. ఇలా కష్టాలు రైతులను వెంటాడాయి. అష్టకష్టాలు పడి పంట చేతికందే సమయానికి మంచి ధర పలకడంతో రైతులు లాభాలు గడించారు. ఈ ఏడాది మిరప సాగుకు వాతావరణం అనుకూలిస్తుండటంతో సాగుకు సన్నద్ధమవుతున్నారు. నంద్యాల జిల్లా పరిధిలోని 29 మండలాల పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 10 వేల హెక్టార్లలో మిరప సాగు సాధారణ విస్తీర్ణం. ఈ నెలాఖరు నుంచి మిరప సాగుకు అదును కాగా వర్షాలు అనుకూలంగా మారటంతో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే ఆస్కారం ఉన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో బోర్లు, బావులు, చెరువులు, ఎస్సార్బీసీ, కేసీ కెనాల్, కుందూనది, పాలేరు, కుందరవాగు, తదితర సాగునీటి వనరుల ఆధారంగా నారుమడుల్లో సిద్ధం చేసుకుని సూపర్–10, తేజ, డబ్బీబ్యాడీ రకాలకు చెందిన మిరప సాగుకు నారు పోశారు. ఈ ఏడాది మిరప సాగుపై రైతులు ఆసక్తి కనబరుస్తుండంతో సాధారణ సాగు విస్తీర్ణం కంటే రెట్టింపు అయ్యే అవకాశం ఉంది. గత ఏడాది క్వింటా రూ. 24 వేల వరకు ధర పలికింది. మిరప సాగులో రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, కూలీలు, కోత, తదితర పెట్టుబడులు పోనూ ఎకరాకు రూ. లక్షకు పైగా నికర ఆదాయం చేకూరింది. మిరప సాగు కలిసి రావడంతో ఈ ఏడాది రైతులు రెట్టింపు ఉత్సాహంతో అదే పంటపై ఆసక్తి కనబరుస్తున్నారు. పది వేల హెక్టార్లలో సాగు సాధారణ విస్తీర్ణం కాగా సుమారు 20 వేల హెక్టార్లలో సాగయ్యే సూచనలు ఉన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. మిరప సాగుకు పొలాలను కౌలుకు తీసుకునేందుకు రైతులు పోటీ పడుతుండటంతో కౌలు ధర అమాంతం పెరిగింది. ప్రస్తుతం ఎకరాకు రూ. 90 వేల వరకు కౌలు ధర పలుకుతుండటం విశేషం. ఒక్కో రైతు 2 నుంచి 20 ఎకరాల వరకు మిరప సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

గత ఏడాది 25– 28 క్వింటాళ్ల దిగుబడులు

గత ఏడాది జిల్లాలోని ఆయా మండలాల్లో ఖరీఫ్ సీజన్‌లో 7,320 హెక్టార్లలో మిరప సాగు సాధారణ విస్తీర్ణం కాగా 10,250 హెక్టార్లలో సాగు చేశారు. ఇందులో స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో 3,014 హెక్టార్లలో సాగు చేయాల్సి ఉండగా ఆయా మండలాల్లో 3,112 హెక్టార్లలో రైతులు మిరప పంట సాగు చేశారు. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, కోత, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. లక్షకు పైగా వెచ్చించారు. మొదట్లో వర్షాభావం, పేరు చివరికోత దశలో అకాల వర్ష ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు, జెమిని వైరస్ దిగుబడులపై ప్రభావం చూపాయి. అన్ని కష్టాలను ఎదుర్కొని మిరప దిగుబడులు చేతికంది ఎకరాకు 25 నుంచి 28 క్వింటాళ్ల దిగుబడులు వచ్చాయి. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే గత ఏడాది గిట్టుబాటు ధర రైతులను గట్టెక్కించింది. క్వింటా ఎండు మిర్చి రూ. 22 వేల నుంచి రూ. 24 వేలు ధర పలకడంతో దిగుబడులు కాస్త తగ్గినా మద్దతు ధరతో రైతులకు ఆదాయం చేకూరింది.

మూడు ఎకరాల్లో సాగు చేస్తా



గత ఏడాది ఎకరా రూ. 35వేలు కౌలు చెల్లించి మూడు ఎకరాల్లో మిరప పంట సాగు చేశాను. ఎకరాకు 22 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడులు వచ్చాయి. క్వింటా రూ. 24వేల ప్రకారం అమ్ముకున్నాను. ఈ ఏడాది అదే విస్తీర్ణంలో మిరప సాగుకు పొలాన్ని సిద్ధం చేసుకుంటున్నాను. ముందస్తు వర్షాలు అనుకూలంగా మారటంతో మిరప సాగు కలిసొస్తుందని భావిస్తున్నాను. గతేడాది తరహాలో లాభాలు రావాలని కోరుకుంటున్నాను. – కుళాయప్ప, రైతు, అమడాల, కోవెలకుంట్ల మండలం

సబ్ డివిజన్‌లో మిరప సాగు పెరుగుతోంది



గత మూడు సంవత్సరాల నుంచి జిల్లాలో మిరప సాగు విస్తీర్ణం పెరుగుతోంది. వరుసగా లాభాలు గడిస్తున్న రైతులు ఈ పంటపైనే దృష్టి సారించారు. ఈ ఏడాది స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో 3,018 హెక్టార్లలో మిరప సాగు సాధారణ విస్తీర్ణం. గత ఏడాది దిగుబడులు బాగా రావడంతో సాగు విస్తీర్ణం పెరిగే ఆస్కారం ఉంది. మిరప రైతులు సస్యరక్షణ చర్యలుచేపడితే మంచి దిగుబడి సాధించవచ్చు. – నిరంజన్, ఏడీఏ, కోవెలకుంట్ల

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత

• ముగ్గురు నిందితుల అరెస్ట్

ఎమ్మిగనూరురూరల్: సెబ్ సర్కిల్ పరిధిలోని మాధవరం చెక్‌పోస్టు దగ్గర భారీగా కర్ణాటక మద్యం పట్టుబడింది. మంగళవారం స్థానిక సెబ్ కార్యాలయ అవరణలో సెబ్ సీఐ జయరాంనాయుడు విలేకరులకు వివరాలు వెల్లడించారు. కర్ణాటక నుంచి టీఎస్ 08ఈటీ 4279 నెంబర్ గల కారులో మంత్రాలయం మండలం రచ్చుమర్రి గ్రామానికి చెందిన పల్లెపాడు లక్ష్మన్న, వీరేష్ ఎమ్మిగనూరు మండలం గుడేకల్ గ్రామానికి చెందిన బోయ యువరాజు మద్యం తీసుకొస్తున్నారు. సెబ్‌పోలీసులు మంగళవారం తెల్లవారుజామున మాధవరం చెక్‌పోస్ట్ దగ్గర తనిఖీలు చేస్తుండగా కారులో మద్యం బయటపడింది. 21 బాక్సుల్లో 2016 టెట్రా మద్యం ప్యాకెట్లు ఉన్నాయి.



పట్టుబడిన కారు, మద్యం, నిందితులను అరెస్ట్ చూయిస్తున్న సెబ్ సీఐ జయరాంనాయుడు

ఈ మద్యంతో పాటు కారును సీజ్ చేసి ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ వెల్లడించారు. పట్టుబడిన మద్యం విలు రూ. 1,05,000 ఉంటుందని తెలిపారు. దాడుల్లో సెబ్ ఎస్ఐలు సోమశేఖర్‌రావు, చంద్రమోహన్, హెచ్‌సీలు గోపాల్, లింగప్రసాద్, షరీఫ్, రబ్బాని తదితరులు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతతో సేవలు అందించాలి

- జగనన్నకు చెబుదాం ఫిర్యాదులను సంతృప్తి స్థాయిలో పరిష్కరించండి
- సచివాలయ సిబ్బంది పని తీరు మెరుగుపడాలి
- ఐటీ సెక్రటరీ, జేకేసీ స్పెషల్ ఆఫీసర్ కోన శశిధర్





మాట్లాడుతున్న ఐటీ సెక్రటరీ కోన శశిధర్, చిత్రంలో కలెక్టర్ మనజీర్, ఎస్పీ రఘువీర్‌రెడ్డి హాజరైన అధికారులు

నంద్యాల: 'ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు బాధ్యతతో వ్యవహరించి మెరుగైన సేవలు అందించాలి. అర్జీదారుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని స్వయంగా కలిసి ఎలాంటి సంతృప్తి పొందుతాడో అదే రీతిలో జగనన్న చెబుదాం దరఖాస్తులను కూడా అదే స్థాయిలో నాణ్యతతో పరిష్కరించాలి' అని ఐటీ సెక్రటరీ, జేకేసీ స్పెషల్ ఆఫీసర్ కోన శశిధర్ జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ కోన శశిధర్ మాట్లాడుతూ సచివాలయ, మండల స్థాయి సిబ్బంది పనితీరు మెరుగుపరిచి జగనన్నకు చెబుదాంకు వచ్చిన అర్జీలను పారదర్శకంగా పరిష్కరించాలని సూచించారు. 1902కి వచ్చే ఫిర్యాదుల విషయంలో ప్రభుత్వం అత్యంత శ్రద్ధ చూపిస్తోందన్నారు. మండలంలో ఏఏ అంశాలపై అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయో అన్వేషించి ఆ మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. సాధ్యం కాని సమస్యలకు సరైన రీతిలో ఎండార్స్‌మెంట్ ఇచ్చి వాస్తవ విషయాలను అర్జీదారులకు వివరించి సంతృప్తి పరచాలన్నారు. భూ సమస్యలు, తాగునీటి సరఫరా, పంచాయతీరాజ్ తదితర శాఖలకు సంబంధించి పరిష్కరించిన వాటిలో అసంతృప్తి ఎక్కువగా ఉన్నట్లు కనిపిస్తోందన్నారు. ఆత్మకూరు, బండి ఆత్మకూరు, నందికొట్కూర్ మండలాల్లో అసంతృప్తి శాతం అధికంగా ఉందని నెల వ్యవధిలో మెరుగు పరచాలని ఆత్మకూరు ఆర్డీవోను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ మాట్లాడుతూ మే 9 నుంచి ఈ నెల 3వ తేదీ వరకు జగనన్నకు చెబుదాం 3,781 ఫిర్యాదులు వచ్చాయని, 58 శాతం ఫిర్యాదులను పరిష్కరించడం జరిగిందన్నారు. ఇంకా 42 శాతం ఫిర్యాదుల పరిష్కారం వివిధ దశల్లో ఉందని, సంబంధిత సమాచారాన్ని శాఖల వారీగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జగనన్నకు చెబుదాం స్పందన టీం జిల్లాస్థాయి, డివిజన్, మండల స్థాయిలో అధికారులను నియమించి పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, మున్సిపల్‌కమిషనర్ రవిచంద్రారెడ్డి, నంద్యాల,ఆత్మకూరు,డోన్ ఆర్‌డీఓలు శ్రీనివాసులు,దాసు,వెంకటరెడ్డిలు, అధికారులు పాల్గొన్నారు.

అతివేగానికి ఇద్దరు బలి

• ఆత్మకూరు సమీపంలో లారీని ఢీకొట్టిన ఆటో



మృతి చెందిన నాగన్న

ఆత్మకూరు రూరల్: అతివేగం ఇద్దరిని బలి తీసుకుంది. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న ఇద్దరిని మింగేసింది. కర్నూలు – గుంటూరు రహదారిలో ఆత్మకూరు సమీపంలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్నూలుకు చెందిన తండ్రి, కుమారుడు మృత్యువాత పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బైర్లూటీ సమీపంలోని సంజీవ నగర్ తండా నుంచి ఏడుగురు ప్రయాణికులతో ఆత్మకూరుకు బయలుదేరిన ఆటో అమలాపురం దాటిన తరువాత ముందు వెళుతున్న మరో ఆటోను ఓవర్ టేక్ చేసే ప్రయత్నంలో ఎదురుగా వస్తున్న లారీని వేగంగా ఢీకొంది. ఈ లారీ పత్తికొండ నుంచి కాకినాడ వెళుతూ ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో కర్నూలు నగరంలోని బొంగుల బజార్‌కు చెందిన నాగన్న(36) అక్కడికక్కడే మృతి చెందగా ఆయన తండ్రి వీరయ్య (65) తీవ్రంగా గాయపడి కర్నూలు సర్వజన వైద్యశాలలో చికిత్సలో ఉండి కోలుకోలేక మరణించాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఎస్ఎస్ తండా వాసులు హనుమంతు నాయక్ (ఆటో డ్రైవర్), వరలక్ష్మీబాయి, వనిత, సుబ్బమ్మ, బైర్లూటీకి చెందిన నాగరాజు పరిస్థితి విషమంగా ఉండడంతో పోలీసులు కర్నూలు సర్వజన వైద్యశాలకు తరలించారు. సంఘటనాస్థలికి హుటాహుటిన వెళ్లిన ఆత్మకూరు సీఐ సుబ్రమణ్యం, ఎస్ఐ కృష్ణమూర్తి పరిస్థితిని సమీక్షించి సహాయక చర్యల్లో పాల్గొన్నారు. అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

బతుకు బాటలో తండ్రి, కుమారుడు మృత్యువాత

కర్నూలు బొంగుల బజార్‌లో బొంగులు, కర్రలు వెదురు ఉత్పత్తుల వ్యాపారం చేసే వీరయ్య తన కుమారుడు నాగన్నతో కలసి మంగళవారం బైర్లూటీకి వచ్చినట్లు తెలుస్తోంది. అక్కడ వెదురు పట్టుడు కట్టెలు, ముళ్లగర్రలు, దోమతెలర కర్రల గురించి వాకబు చేసుకున్నారు. అనంతరం తిరుగు ప్రయాణంలో ఆటోలో ఆత్మకూరుకు వస్తూ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఒకే కుటుంబంలో తండ్రి,కుమారుడు ప్రమాదంలో మరణించడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



మృతి చెందిన అబ్రహం

శ్రీశైలం: క్షేత్ర పరిధిలో శివాజీ గోపురం సమీపంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికులు మృతదేహాన్ని గుర్తించి మంగళవారం మధ్యాహ్నం వన్ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. సీఐ దివాకర్‌రెడ్డి, వన్‌టౌన్ ఎస్ఐ లక్ష్మణరావు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడి జేబులో ఉన్న ఆధార్‌కార్డు ద్వారా ఆత్మకూరు సమీపంలోని వడ్లరామాపురానికి చెందిన అబ్రహం (28)గా ఆచూకీ గుర్తించారు. మృతుడు ఓ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుని శ్రీశైలంలోని కొత్తపేటలో నివాసం ఉంటూ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. వీరికి ముగ్గురు కుమార్తెలు కాగా నాలుగు రోజుల క్రితం అతని భార్య మగబిడ్డకు జన్మనిచ్చింది. కాగా అబ్రహ్మం ఫూట్‌గా మద్యం సేవించి డీహైడ్రేషన్‌కు గురై సోమవారం రాత్రి మరణించి ఉంటాడని పోలీసులు ప్రాథమిక నిర్ధారించినట్లు చెప్పారు. పోస్టమార్టం నిమిత్తం మృతదేహాన్ని సున్నిపెంట వైద్య శాలకు తరలించినట్లు, కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు.

మత్స్య శాఖ పథకాలపై
ఆర్బీకేల స్థాయిలో అవగాహన





సమావేశంలో మాట్లాడుతున్న జేసీ, హాజరైన అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): మత్స్య శాఖ పథకాలపై ఆర్బీకేల స్థాయిలో పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో మత్స్యశాఖ జిల్లా స్థాయి కమిటీ సమావేశం జేసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 21 యూనిట్ల ఏర్పాటుకు జిల్లా స్థాయి కమిటీ ఆమోదం తెలిపింది. 16 ఫిష్ ఆంధ్ర యూనిట్లు, ఒక త్రీవీలర్, ఒక ఫోర్ వీలర్, రూ.10 లక్షల యూనిట్, 20 లక్షల యూనిట్‌లు ఒకటి చొప్పున మంజూరుకు అనుమతిచ్చారు. జేసీ మాట్లాడుతూ రుద్రవరం దగ్గర ఉన్న బోటింగ్ క్లబ్‌లో కూడా చేపల ఉత్పత్తులను అందుబాటులో ఉంచడంతో పాటు రాక్ గార్డెన్‌లో చేపల ఉత్పత్తుల స్టాల్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద అమలు చేస్తున్న పథకాలకు ఎస్సీ, ఎస్టీ, మహిళలకు 60 శాతం, ఇతరులకు 40శాతం సబ్సిడీ ఉంటుందని తెలిపారు. సమావేశంలో జిల్లా మత్స్య శాఖ అధికారి శ్యామలమ్మ, జిల్లా స్థాయి కమిటీ సభ్యులు జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి, డీఆర్‌డీఏ అదనపు పీడీ శ్రీధర్‌రావు, ఎల్‌డీఎం రామచంద్రరావు, జిల్లా ఫిషర్‌మన్ కో–ఆపరేటివ్ సొసైటీ పర్సన్ ఇన్‌చార్జీ స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో తొమ్మిది మంది అరెస్ట్



గంజాయి విక్రేతలు, కొనుగోలుదారుల అరెస్ట్ చూపుతున్న సీఐ దివాకర్‌రెడ్డి

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట గ్రామంలో నలుగురు గంజాయి విక్రేతలు, ఐదుగురు కొనుగోలుదారులను పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ దివాకర్‌రెడ్డి, ఎస్ఐ గంగయ్య యాదవ్ తెలిపిన వివరాల మేరకు.. స్థానిక లంబాడీ కాలనీలో కొర్ర దసలీబాయి గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో మంగళవారం సోదాలు జరుపగా 2.900 కిలోల గంజాయి లభించింది. దసలీబాయిని విచారించగా సున్నిపెంటకు చెందిన పటాన్ అబ్దుల్ సుకూర్, లంబాడీ కాలనీకి చెందిన కేతావత్ హారతీబాయి, నాగమణిబాయి దగ్గర గంజాయి కొని చిన్న చిన్న పొట్లాలుగా కట్టి విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ మేరకు సోదాలు జరుపగా హారతిబాయి వద్ద ఒక కేజీ 100 గ్రాముల గంజాయి, నాగమణిబాయి దగ్గర 600 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే గంజాయి కొనుగోలు చేస్తున్న మరో ఐదుగురిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. దాడుల్లో తహసీల్దార్ రాజేంద్రసింగ్, రెవెన్యూ అధికారులు రంగసాయి, ప్రదీప్ పోలీసులు పాల్గొన్నారు.

కర్నూలు సర్కిల్‌కు నలుగురు ఎఫ్‌ఆర్‌ఓలు

• ఆదోని అటవీశాఖ రేంజర్‌గా నంద్యాల జిల్లావాసి తేజశ్విని



తేజశ్విని

కర్నూలు కల్చరల్: కర్నూలు సర్కిల్ అటవీ శాఖలో నూతనంగా నలుగురు ఫారెస్ట్ రేంజ్ అధికారులు (ఎఫ్ఆర్ఓ) నియమితులయ్యారు. ఈ నలుగురు మహిళలే కావడం విశేషం. ఏపీపీఎస్సీ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 21 ఎఫ్ఆర్ఓల నియామకం జరిగింది. రాయలసీమకు ఐదుగురిని కేటాయించగా అందులో నలుగురు కర్నూలు సర్కిల్‌కు వచ్చారు. వీరిలో సిద్దవటం ఎఫ్ఆర్ఓగా కళావతి, ప్రొద్దుటూరుకు హే మాంజలి, ఒంటిమిట్టకు ప్రణీతా బాయ్, ఆదోనికి పేరుసోముల తేజశ్విని నియమితులయ్యారు. వీరందరూ అస్సాంలో 18 నెలలు శాఖ పరమైన శిక్షణ పొందారు. కాగా ఆదోని డివిజన్ ఎఫ్ఆర్ఓగా నియమితులైన పేరుసోముల తేజశ్విని నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం శాతన కోట గ్రామానికి చెందిన రత్నమ్మ, పి.భూషన్నల మూడో కుమార్తె. తండ్రి జ్యుడీషియల్ ఉద్యోగి. తేజశ్విని హైదరాబాద్ జేఎన్‌టీయూలో బీటెక్ పూర్తి చేశారు.

రేషన్ మస్తుగా..

- కార్డుదారులకు బియ్యంతో పాటు చక్కెర, బ్యాళ్లు
- రాగులు, జొన్నలు కూడా అందుబాటులోకి
- అర్బన్‌కార్డు దారులకు అదనంగా గోధుమ పిండి
- బియ్యం ఒక్కటే అంటూ పచ్చపత్రిక విషపు రాతలు



ఎండీయూ వాహనాల ద్వారా పేదలకు బియ్యంతో పాటు చక్కెర, గోధుమ పిండి పంపిణీ చేస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): పేదల సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తోంది. పెరిగిన ధరలతో పేదలు ఇబ్బంది పడకూడదని నిత్యాసర సరుకులను సైతం వారికి అందుబాటులో ఉంచింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా రేషన్ కార్డు దారులకు బియ్యం, చక్కెర, బ్యాళ్లతోపాటు రాగులు, జొన్నలు, గోధుమ పిండి అందించేందుకు చర్యలు చేపట్టింది. అయితే, ఈ నిత్యావసరాల పంపిణీపై పచ్చ పత్రిక ఈనాడు విషం చిమ్ముతోంది. బియ్యం మాత్రమే పంపిణీ అంటూ ఈనెల 2వ తేదీ 'ప్రచారం గొప్ప.. ఇచ్చింది కొంత' పేరుతో కథనం అల్లి ప్రచురించింది. ఈ నేపథ్యంలో వాస్తవాలు ప్రజలకు తెలిసేలా ఆధారాలతో కథనం.


అందుబాటులో రాగులు, జొన్నలు

కర్నూలు జిల్లాలో 1232 రేషన్‌షాపులు ఉన్నాయి. వీటి పరిధిలో 6,67,990 రేషన్‌కార్డుదారులు ఉన్నారు. వీరి కోసం 10,259 టన్నుల బియ్యంతో పాటు 322.979 టన్నుల చక్కెర, 654.307 టన్నుల బ్యాళ్లు, 1750.563 టన్నుల రాగులు, 252.188 టన్నుల ఆట గోదుమ పిండిని రాష్ట్ర ప్రభుత్వ కేటాయించింది. అయితే, రెండునెలలుగా నాఫెడ్ నుంచి బ్యాళ్ల కేటాయింపులు లేకపోవడంతో ఉన్న వాటిలో 25 శాతం మంది రేషన్ కార్డుదారులకు రోటేషన్ పద్ధతిలో కేటాయిస్తున్నారు. గత రెండు నెలల నుంచి రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌దారులకు రాగులను అందుబాటులోకి తెచ్చింది. శరీరానికి ఎంతో మేలు చేసే వీటిని పేద ప్రజల కోసం కర్ణాటక ఎఫ్‌సీఐ నుంచి తెప్పించి ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. కార్డుకు కేజీ ప్రకారం అందజేస్తున్నారు. కొన్ని చోట్ల రాగులను తీసుకోవడానికి ప్రజలు విముఖత చూపుతు న్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే పశ్చిమ ప్రాంతంలోని ఆదోని, ఆదోనిఅర్బన్, ఆలూరు, కౌతాళం, పెద్దకడబూరు, కోసిగి, హాలహర్వి, హొళగుంద మండలాల్లో కార్డుదారులకు రెండు నెలలుగా జొన్నలు వేస్తున్నారు. బియ్యంకోటలో కార్డుకు కేజీ ప్రకారం అందజేస్తున్నారు.

అర్బన్ కార్డుదారులకు గోధుమ పిండి

జిల్లాలోని కర్నూలు మునిసిపల్ కార్పొరేషన్, ఆదోని, ఎమ్మిగనూరు మునిసిపాలిటీలు, గూడూరు నగర పంచాయతీల్లో బియ్యం, చక్కెర, బ్యాళ్లు, రాగులతో పాటు అదనంగా గోధుమ పిండి పంపిణీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఒక్కో కార్డుకు కేజీ చొప్పున అందజేసే ఈ గోధుమ పిండి ధర రూ.16 మాత్రమే. అర్బన్ రేషన్ కార్డుదారులందరూ ఈ సరుకులను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

ఎండీయూ వాహనదారులను అడిగి తీసుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వం కార్డుదారులకు బియ్యం, చక్కెర, బ్యాళ్లతోపాటు అర్బన్‌లో గోధుమ పిండి, జిల్లాలోని అన్ని చౌక ధరల డిపోల్లో రాగులు, ఆదోని ఏరియాలో 8 మండలాల్లో జొన్నలు అందుబాటులో ఉంచింది. అయితే, ఆయా వస్తువులను లబ్ధిదారులు ఎండీయూ ఆపరేటర్లను అడిగి తీసుకోవాలి. కొన్ని చోట్ల డీలర్లు అందుబాటులో లేవని చెబుతున్నా అది నిజం కాదు. – ఆచార్యులు, డీఎస్ఓ